డాక్టరు. కే. ఎస్. కేసరిగారి బంగరుపతక బహుమానమునందిన వ్యాసము.

# "స్త్రీ అబలకాదు"

౧

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

[ నెల్లూరు ప్రోగ్రెసివు యూనియనువారు ప్రతిసంవత్సరము ఆంధ్రస్త్రీలకు వ్యాసరచమున పోటీపరీక్షనొకదానిని నిర్వహించుచున్నారు. ఈపరీక్షకుగాను పంపబడు వ్యాసములలో నుత్తమమగుదానికి డాక్టరు. కే. యన్. కేసరిగారు ఒకస్వర్ణపతకమును ఇచ్చుచుండుటవాడుక. ఈవత్సరము పోటీవ్యాసము 'స్త్రీ అబల కాదు' అనువిషయమునుగూర్చి. ఇందుకు పన్నెండుగురు స్త్రీలు పోటీచేసిరి. అందు శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి వ్యాసము బహుమానార్హమని పరీక్షాధికారులు నిర్ణయించిరి. బహుమానము పొందిన ఆవ్యాసమిచ్చట పూర్తిగ ముద్రించుచున్నారము. మిగిలినవ్యాసములలోని ముఖ్యభాగములనెత్తి పైమాసము ప్రచురింతుము. శ్రేష్ఠతమమైన వ్యాసమువ్రాసి 'కేసరి స్వర్ణపతకమును' బహుమానమందిన శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారిని ఈపట్టున మనఃపూర్వకముగ అభినందించుచున్నాము. ఆమె పాండితీగరిమ మాకు సుపరిచితమైనది. ఆమెవ్రాసి పంపువ్యాసములు అక్షరము మార్చకుండనే అచ్చునకీయవచ్చునంతటి నిర్దుష్టములై యుండునని అనుభవముచే చేయెత్తి చెప్పుచున్నాము. శ్రీవరలక్ష్మమ్మగారి శైలిలో ఒకవిధమైన వేగమున్నది. అలతి పదములచే కూర్పబడిన చిన్నవాక్యము లావేగమునకు ముఖ్యపరికరములు. ఆమెకుగల వస్తుపరిశీలనాశక్తి ఆమె వ్యాసములందలి ప్రతివాక్యమున పొడగట్టుచుండును. శైలికి వ్యక్తిత్వము నీయగల సామర్థ్యము, వస్తువులను పరిశీలించుటలో అపూర్వమైనశక్తి, విషయములనుండి మంచినీతిని వడపోసి ప్రదర్శింపగల ప్రతిభ శ్రీవరలక్ష్మమ్మగారికి సహజగుణములు. అవి ఈవ్యాసమున బాగుగ ప్రదర్శితములైనవి. వ్యాసము ముగించుటలో ఈమె కొంత తొందరపాటు చూపించినను ఎత్తుగడ, నిర్వహణమును ప్రశస్తముగనున్నవి. పరీక్షాధికారు లీవ్యాసమునకు నూటికి నలుబదితొమ్మిది మార్కుల నిచ్చిరి. —సంపాదకుడు.]

చరాచరాత్మకంబగు విశాలసృష్టికి హేతువులు ప్రకృతి పురుషులు. పురుషుడన పరమాత్మ. ఆ పరమాత్మ స్వరూపముయొక్క సంకల్ప వికారమే ప్రకృతి. ఆ ప్రకృతియే మాయయనియు, శక్తియనియు వేదాంతశాస్త్రమున వచింపబడుచున్నది. శక్తియననేమి? బలము.

శక్తియొక్క తోడ్పాటులేక జగము లుత్పాదింపబడుటలేదు, పెంపొందుటలేదు, లయమగుటలేదు. ఈవిశ్వమునందలి ప్రతిపరమాణువును శక్తిసహితమైయేయున్నది. సృష్టిస్థితిలయకారకులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరులేమి, దేవేంద్రాది దిక్పాలకులేమి, శక్తిసహాయ

మునసే తమతమకృత్యముల దక్షతతో నిర్వర్తింపగలుగుచున్నారు. సూర్యచంద్రాది గ్రహములును పృథివ్యాపస్తేజోవాయురాకాశముల నెడి పంచమహాభూతములును శక్తి సహాయమునసే నిజధర్మముల నెఱవుచున్నవి. ఈ బ్రహ్మాండమునందలి స్థావరజంగమాత్మ కంబగు సమస్తపదార్థములకును నిట్టి సామర్థ్య మొసఁగుచున్న యాశక్తి యెయ్యది గలదో అదియే జగన్మాత, ఆదిశక్తి. శివునియిల్లాలు శివ. ఈమెశక్తికిఅధిష్ఠానదేవత. ఈమె పెని మిటి కర్థాంగమై దేహబలమునుగూర్చుచున్నది. ధాతయిల్లాలు వాణి. ఈమెసమస్తవిద్య లకుఅధిష్ఠానదేవత. ఈమె పెనిమిటి వాక్కున నిలిచి వాగ్బలమును జేకూర్చుచున్నది. విష్ణువునిల్లాలు రమ. ఈమె సంపదకధిష్ఠానదేవత. ఈమె పెనిమిటి మనఃపీఠముననిల్చి మనో బలమును గలిగించుచున్నది. వ్యవహారసౌకర్యమునకై ముమ్మూర్తులు కల్పించి మూఁడభి ధేయములఁ బిలువఁబడుచున్నను యీమువ్వురును మూఁడుమూర్తులా? కాదు. ఒక్కటే పరమాత్మస్వరూపము. మూఁడు మూర్తు లొక్కటైనపుడు ముగ్గురు దేవేరు లొక్కటియే గదా! కాన మనోవాక్కాయకర్మంబులకు బలంబుచేకూర్చెడి ప్రకృతి స్వరూపయగు జగన్మాతయు నఖండమే. ఆయఖండజ్యోతిర్మయస్వరూపమునుండి యుద్భూతమైన యొకా నొకకళయే స్త్రీ.

కావుననే మనభారతవర్షమున స్త్రీశక్త్యంశసంభూతగా నెన్నబడుచున్నది. శక్తి యన బలమని యర్థముకదా. కాన శక్త్యంశసంభూతయగు స్త్రీ యబలయెట్లగును? కాదు. స్త్రీయొక్క యాత్మబలమనుపమానమైనది. ఒకప్పుడు స్త్రీయొక్క యాత్మబలము బొందితో స్వర్గమున కుద్గమింపగలిగెను. దివినుండి భువికి వాహినియై ప్రవహింపగలిగెను. సూర్యోదయముకాకుండ కాలము నరికట్టగలిగెను. ముమ్మూర్తుల ముద్దుబాలురగావింప గలిగెను. రాళ్లుశనగలు చేయజాలెను. దండధరునితోఁ బోరాడి భర్తృజీవములను గొని రాగలిగెను. కనులజూడకనే సమస్తమును జూడగలిగెనుశక్తి, చెప్పకయే సర్వమును తెలిసికొనెడు సామర్థ్యము, శస్త్రాస్త్రప్రయోగము లేకయే యెదిరిని నిర్జింపజాలెడు మహామహిమను నాత్మశక్తిచే స్త్రీ సంపాదింపఁజాలెను. అహా! స్త్రీయొక్క యాత్మ బలమెంత నిరుపమానము!

స్త్రీయొక్క కంఠమాధురియు వాక్సౌజన్యమును నసదృశములు. సర్వసంగపరి త్యాగులై కాఱడవులఁజేరి నిరుపవాసంబుల గడుసుతపంబులు సల్పెడు సంయమివర్యుల నిశ్చలచిత్తములను సైతము చలింపఁజేయఁ జాలినదగినచో స్త్రీయొక్క గానశక్తియొక్క బలీయత వేఱే వివరింపనేల? "శ్రీర్వాక్చనారీణాం స్మృతిర్మేధాధృతిఃక్షమా". స్త్రీల

యందుండెడి సంపద, వాక్కు, స్మృతి, బుద్ధి, ధైర్యము, ఓర్పు నేనేయని భగవద్గీత యందు శ్రీకృష్ణభగవానుఁడు వాక్రుచ్చియున్నాఁడు. కాన శ్రీగీతావచనము ప్రకారము స్త్రీవాక్కునందు దేవాంశ గలదు. దేవాంశగలవాక్కు స్త్రీకిఁ గలిగియుండ వాగ్బలమున స్త్రీ లబలలెట్లగుదురు? మృదులము, మధురము, మనోజ్ఞమునగు స్త్రీవాక్కు బహుసత్త్వము గలది. ఒకప్పుడు స్త్రీవాక్కు మృదులమై దీనజనులయెడ కరుణార్ద్రమై దీనజనోద్ధారక మగును. మఱియొకచో తీక్ష్ణమై యలసులగు దేశీయుల యుత్సాహము నుద్దీపింపఁజేయఁ జాలును. వేఱొకచో కఠినతమమై శత్రుహృదయవిదారణచణమగును. మఱొకచో శాంతమై ధర్మయుతమై మహాసభల ధర్మప్రసంగములఁజేయఁ జాలియుండును. ఒండొకచో లలితశృంగారభావసమన్వితమై రసికజనమనోభిరామమై యలరారును. స్త్రీయొక్క వాగ్బలిమి యెందును నిస్సత్త్వముగాదు. జనకునితో వాదించిన సులభ, యాజ్ఞవల్క్యునితో వాదించిన మైత్రేయి, ఆదిశంకరునితో వాదించిన సరసవాణి, దండధరనితో ప్రసంగించిన సావిత్రి స్త్రీలవాక్పాటవమును నిరూపింపగల తార్కాణలుగదా!

దేహబలమునగూడ స్త్రీ లబలలుగారు. బలప్రదర్శన మనేక విధములుగనుండును. అందు సమరము సేయుటనునది బలనిరూపణ యందధికమైనది. పౌరాణికయుగమున నేమి, ఐతిహాసిక యుగముననేమి, చారిత్రక యుగముననేమి పెక్కుమంది స్త్రీలు యుద్ధముచేసినట్లు గ్రంథములవలన తెలిసికొనుచున్నాము. నేఁడు భారత దేశమునకట్టి యుద్ధావసరములులేక పోవుటచే తారాబాయి, రుక్మాబాయివంటి బలవంతురాండ్రగు నారీమణులను వినోదార్థముగ సర్కసులలోఁగనుచున్నాము.

పౌరాణికయుగమున సత్యభామ నరకునితోఁబోరి దేహబలమున స్త్రీయబల కాదని నిరూపించెను. చారిత్రక యుగమునగూడ పెక్కుమంది నారీమతల్లు లశ్వారోహణగజారోహణాది విద్యలయందును, సాముగరిడీలయందును, శస్త్రశస్త్ర ప్రయోగములయందును నిపుణలై యుద్ధములు చేసినట్లు నిదర్శనము పెక్కులున్నవిగదా. కావున దేహబలమున స్త్రీయబలకాదు.

త్రికరణముల చేతనేగాక సత్త్వరజస్తమంబులనెడి త్రిగుణములచేతను స్త్రీయొక్క బలిమియల్పముగాదని నిరూపింపనగును. ఏది మనస్సుచే మనస్సును జ్ఞానబలముచే జయింపఁజాలునో యది సాత్త్వికబలము. అట్టి బలమునకు కాయముతో బనిలేదు. మైత్రేయియొక్క జయము, సులభయొక్క జయము, సరసవాణియొక్క జయము యిట్టి సాత్త్వికబలముతో లభ్యమైనది. మహాభారతములో చెప్పబడిన పతివ్రత ధరహం

333

కారియగు కౌశికుని యహంకృతిని గుర్తించిన దిట్టి సాత్వికయుతమైన జ్ఞానబలము చేతనే. కుసుమముయొక్క శోభ చెడకుండనే భ్రమరము మకరందము నాస్వాదించునట్లు సాత్వికబలము మనుష్యుని శరీరము నొవ్వఁజేయకనే మనస్సును జయించి వశీకృతము గావించుకొనును.

అస్త్రశస్త్రాదిసాధనములచేత నొకరినొకరు జయించుట రాజసబలము. సత్యభామాది శూరనారీమణులు యుద్ధము చేసిన చందమిట్టి రాజసబలమునకుఁ జెందినది.

తాటకాదియంగనల బలము తామసగుణయుతమైనది. ఈ తామసబలమునందు నెట్టి ధర్మసూక్ష్మతయు లేదు. కేవలము క్రౌర్యయుతమైన హింసయొక్క వికారమే తామసబలముయొక్క నైజము. త్రిగుణవికార సత్యమునందుగూడ స్త్రీ లబలలుగారను నది నిరూపించుటకే యీయంశము ప్రస్తావింపఁబడినది; కాని గర్హ్యమగు తమోబల విషయమున స్త్రీలబలలై యుండుటయే యొప్పు. ఇఁక యుగవిభాగముచే స్త్రీబలిమిని విచారింతము. వేదయుగమున స్త్రీ పురుషునితో సమానముగ బ్రహ్మవాదినియై వేదములను వేదాంతములగునుపనిషత్తులనుకూడ రచియించెను. ఏకాగ్రతతో బ్రహ్మ విచారముసల్పి బ్రహ్మసాక్షాత్కారము బడసెను. అవివాహితమై వీర వైరాగ్యము ననుష్ఠించెను. తత్త్వజ్ఞయై మహాసభలలో తత్త్వప్రసంగములు గావించెను. సన్యసింపఁబోవు పెనిమిటితో శాస్త్రప్రసంగము గావించిన మైత్రేయియు, జనకుని సభలో యాజ్ఞవల్క్యునితో వాదించిన గార్గియు, జనకునితోఁ జర్చ చేసిన సులభయు వేదయుగమునకుఁ జెందినవారే. వేదయుగస్త్రీయగు ఆత్రేయి సుమధురసామగానమునకుఁ జొక్కి పశుపక్ష్యాదిజంతుజాలముగూడ నాహారవాంఛమాని తన్మయతతో నిలువబడి పోయెనన స్త్రీ యొక్క వేదపఠనాబలిమి వేఱె వర్ణింపనేల?

పౌరాణికయుగమున స్త్రీ నిజపురుషునకును బరమాత్మకును నభేదము నుపలక్షించి యామహాప్రభావతచే యనేకమహామహిమంబుల జూపగలిగెను. అనసూయ, అరుంధతి, సుశీల, సీత మున్నగు మహాపతివ్రతల కాకరమైన కాలమదియే.

బౌద్ధయుగమున స్త్రీ యొక్క శక్తి మఱొకమాఱుజ్వలముగఁ బ్రజ్వలించెను. ఆనాడు స్త్రీ పురుషునితో సమానముగ శ్రమణియై భోగము లుజ్జగించి, శరీరాభిమానమును జంపుకొని, గురుశుశ్రూషలుచేసి, బౌద్ధమతగ్రంథములు పఠించి, తత్వదర్శినియై గౌతమబుద్ధుని యహింసామతమును బోధించుచు నానా దేశములు పాదచారిణియై గ్రుమ్మరెను. ఆకాలమున సామాన్య స్త్రీలేగాక కాశీసుందరి, మాలిని, సంఘమిత్ర మున్నగు

రాజకుమారికలు కూడ సన్యాసినులై బౌద్ధమతవ్యాప్తికి మహాకృషి చేసిరి. అవివాహితయగు కాశీసుందరి నిరుపమానశేముషీకిని సౌందర్యమునకును మోహితులై రాజకుమారులు కొందఱామెను పరిణయమాడ నుత్సహించి గురువుకడ తత్త్వబోధలందుచున్న యామెను బలాత్కారముగ గొనిపోవ నంకించిరి. యోగశక్తిచే నామె యింటికేగసెను. అమ్మహాసామర్థ్యమునుగని రాజకుమారులు తమ యకృత్యమునకు సిగ్గిలి పశ్చాత్తాపతప్తహృదయులై యామెను క్షమింప వేడిరి. మాలినియను మఱియొక రాజకుమారి హిందూమతాభిమానియగు తండ్రిచే ప్రవాసశిక్ష వేయబడినదై తాను వెడలిపోవు సమయమున మహాసభలో వారము దినములు తత్త్వప్రసంగము సేయుటకు తండ్రిచే యనుజ్ఞవడసి ధర్మప్రసంగము చేసెను. విద్వద్వర్యుల తోడను, మంత్రిసామంతాదిమహాజనులతోడను బరివేష్టితుండగు తండ్రి సమక్షమున మాలిని చేసిన ధర్మప్రసంగమునకు సభ్యులు ముగ్ధులై పోయిరి. హింసాప్రాధాన్యమగు కర్మకాండతో నొప్పిన హిందూమతమును తుండెములుగా ఖండించి బౌద్ధమతము నందలి మహోదారతను వివరింపుచుండ ఆ సభాపరివేష్టితులగు పండితులలో నొక్కరికైన యామె వాదమును కాదను సామర్థ్యములేదాయె. అందఱామె వాదమునకు ముగ్ధులై తలలూపుచుండిరి. వారము దినముల యుపన్యాసము పూర్తియయ్యెను. ఎల్లరకును హిందూమతమునందు భక్తితొలఁగిపోయెను. బౌద్ధమతము నందనురక్తి గలిగెను. మహాతత్త్వజ్ఞురాలగు నా రాజకుమారికకడ తండ్రి మొదలుగా సమస్తసభాసదులును బౌద్ధమత దీక్షఁగొనిరి. ఒకరుగాదు. ఇద్దఱుగాదు. పదివేలమంది గృహస్థులను హిందూమతాభిమానులైన వారిని నొక్కమాఱుగా బౌద్ధమతమును స్వీకరింపఁజేయ జాలిన పాండిత్యగరిమ యెంత యుత్కృష్టమోగదా? అహో! ఎట్టి వాగ్మిని!

అశోకుని తనయయగు సంఘమిత్ర కేవలము తన దేశమున బౌద్ధమతప్రచారము గావించుటతో దృష్టిఁగనలేదు. ఆమె బౌద్ధశ్రమణులతోఁ గలిసి సుమిత్ర, జావా, చీనా, జపాను, సింహళము మున్నగు పలుదేశముల కేగి బౌద్ధమతమును వ్యాపింపఁజేసెను. గౌతమబుద్ధుని ప్రేమమయమగు నహింసాతత్త్వ మానాడు సంఘమిత్ర రమణీయమంజులసుధామయోక్తుల మఱింత సొబగుదేలి నానాదేశములఁ దనజయపతాకలను బ్రతిష్ఠింపఁగలిగెను. ఈ విధముగా బౌద్ధయుగపుస్త్రీ తన సేవాపరాయణతచే, నపూర్వత్యాగముచే, కార్యదీక్షచే, వైదుష్యసంపదచే, తత్త్వజ్ఞానముచే మనోవాక్కాయకర్మంబుల స్త్రీ లబలలుగారని నిరూపింపఁ గలిగినది.

మహమ్మదీయయుగమున స్త్రీకి ఘోషా. అటు నిటు స్వేచ్ఛగా మసలుటకును జదువుటకును స్వాతంత్ర్యములేదు. అయినను నూర్జహాను జహనారాయున్నగు మొగలాయి రాజకుటుంబస్త్రీలు రాజ్యతంత్రములలోఁ బాల్గొని స్త్రీబుద్ధివైశద్యము సామ్రాజ్యములను బాలింపఁ జాలినదని చాటిరి. ఊయ్యేల లూచుహస్తములే సామ్రాజ్యముల బాలింపఁజాలునను సామ్యము వారివలన రూఢియయ్యెను.

రాజపుత్రయుగమున స్త్రీయొక్క అపూర్వత్యాగము, క్షమాశీలత యనుపమానము. రజపూతకాంతలయొక్క బలప్రదర్శన మొకవిధమైనదిగాదు. అసాధారణమైన మతివిశేషము, అసదృశమైన కార్యదీక్ష, అజేయమైన సంగ్రామకుశలత, అపూర్వమైన ఆత్మార్పణము, అకుంఠితమైన దేశాభిమానము, అనితరమైన యాత్మగౌరవము నాదిగాఁగల యసామాన్యగుణములచే విరాజితమైనది రాజపుత్రయుగమునాటి నారీవ్యక్తి! ఆయుగపునారీమూర్తియందు స్త్రీయొక్క యంతఃశక్తులన్నియు నసమానముగాఁ బ్రకాశించినవి. ఉజ్జ్వలమై దుర్నిరీక్ష్యమైన యా తేజోరేఖకు ఖండఖండాంతరములును నిప్పటికిని జోహారు లర్పించుచున్నవనినచో యారజపుత్ర నారీరత్నముయొక్క బలశౌర్యములు వేఱె వర్ణింపనేల?

పైనివర్ణితములైన బహువిధనిదర్శనములచే ప్రాచీనకాలమున స్త్రీ యేవిషయమునను ననగా త్రికరణములను, త్రిగుణములనుగూడ అబలకాదని విదితమయ్యెను. వర్తమానయుగమునందును స్త్రీ యబలగా నుండుటలేదు. రాజకీయముగను, సాంఘికముగను, విద్యావిషయమునను, నార్థికముగను, నైతికముగను, కళావిషయముగను గూడ నాధునికస్త్రీబలసంపన్నత యల్పముగాదనుటకు నేఁడు స్త్రీలు తీర్ణులగుచున్న బహువిధయుత్తమపరీక్షలు, నడుపుచున్న మహాసంస్థలు, చేయుచున్న మహాకార్యములు, ఇచ్చుచున్న మహోపన్యాసములు, పొందుచున్న మహోన్నతపదవులే తార్కాణ. స్త్రీయొక్క భవిష్యమింతకంటె తేజోవంతమై సత్వవంతమై విరాజిల్లఁగలదు. ఇపుడు స్త్రీల కొనగూర్పఁబడుచున్న నవీనశాసనములు స్త్రీసామర్థ్యమును బహుముఖముల వికసీకరించుటకు సాధనములు కాఁగలవు. అయితే స్త్రీ కబలయను పేరేలఁగలిగినది? ఈవిషయమింక విచార్యము. స్త్రీయొక్క బుద్ధిశక్తు లవకాశము లభించినచోట నుజ్జ్వలముగాఁ బ్రజ్వలించినను నవి యథేచ్ఛముగా నెపుడును విజృంభింపఁబడలేదు. పురుషుని స్వార్థమనీష యెప్పుడును స్త్రీప్రాబల్యమునడచివేయుటకే యత్నించినది. స్త్రీకి వేదకాలమున గల విద్యావైవాహికస్వాతంత్ర్యము స్మృతులకాలమునలేదు. స్మృతులకాలమునగల స్వాతంత్ర్యము


336

పౌరాణిక కాలమున లేదు. పౌరాణిక కాలమునగల స్వాతంత్ర్యము చారిత్రక కాలమున లేదు. ఈవిధముగా యుగయుగమునను స్త్రీయొక్క సహజశక్తులు, బుద్ధివైశద్యము శాస్త్రవచనములచేతను, మతవిధులచేతను, సాంఘిక ములగు కట్టుబాటులచేతను, ఆచార పాశములచేతను, కుటుంబపరిస్థితులచేతను, నవిద్యాప్రాబల్యముచేతను నణచివేయఁ బడు చుండెను. స్త్రీపురుషులమధ్య సమత్వధర్మముపోయి పాలకపాలిత పద్ధతియు, యజమాన బానిసీధర్మములును ప్రవేశించెను. ఇట్టికర్కశనిర్బంధములచే క్రమక్రమముగా స్త్రీ పురుషుని భోగోపకరణముగాను, జడపదార్థముగాను మాఱిపోయెను. దురతిక్రమణీయములగు నిట్టి నిర్బంధములు స్త్రీ వికాసావకాశమును నిరోధించుచుండ నారీహృదయము దుర్బల మగుటలో నాశ్చర్యమేమి? కాని యిట్టి నిర్బంధ పరిస్థితులలోఁగూడ సమయము చిక్కి నప్పుడెల్ల స్త్రీయొక్క బుద్ధిబలముగాని, వాగ్బలముగాని, దేహబలముగాని పురుషు నకుఁ దీసిపోలేదు. ఎన్ని నిర్బంధవిధుల బద్ధపఱచినను స్త్రీశక్తిని పూర్తిగాఁ దుడిచి వేయుటకు ఎవరికిని సాధ్యముకాలేదు. అల్పముగానైన స్త్రీసామర్థ్యమును గుర్తింపకుండ నిరసించుటకు ధర్మశాస్త్రములకైన వీలుకాలేదు. స్త్రీసహాయము లేనిపురుషుఁడు నిస్సహా యుఁడు కావునననేయవివాహితుడగు పురుషుని యర్ధశరీరునిగా శాస్త్రములు వాకొని యున్నవి. "స్త్రీ పుంసయోరాత్మ శక్త్యైకత్వ సంపాదనం వివాహః" "ధర్మార్థకామ మోక్షాణాందారాః సంప్రాప్తిహేతవః" ఇత్యాది శాస్త్రవచనములచేత స్త్రీయొక్క ప్రాముఖ్యత వివరింపఁబడినది. స్త్రీశక్తిగాని పురుషుని శక్తిగాని యేదియు పరిపూర్ణముగా దనియు, వివాహబంధముచే నీయుభయశక్తుల నేకీభవింపఁజేయుటచేతనే మానవశక్తి యొక్క పరిపూర్ణత యేర్పడుననియు పైశాస్త్రవచనముల తాత్పర్యమని చెప్పవచ్చును. కాన కాలక్రమమున బహువిధవిధినిషేధములచే దేశమునకు, సంఘమునకు సంబంధించిన ఘనకార్యములకు స్త్రీ దూరము చేయఁబడినను స్వగృహమునందు స్త్రీయొక్క కార్యభార మమితముగనే యుండెను. స్వగృహమున స్త్రీపురుషున కాలోచనఁజెప్పునెడ మంత్రిణిగను, హితముగఁబ్రోవునెడ నాజ్ఞగను, నుపచారములు సేయునెడ పరిచారికగను, శృంగారవిలసన మున గృహమునకుశోభఁదెచ్చెడిలక్ష్మిగను, గృహచ్ఛిద్రముల సహించునెడ సహనవతియైన భూదేవతగను, భోజనభాజనాది సౌకర్యములు గలిగించునెడల దల్లిగను, భోగావసర మున రంభగను, సుభోచితసంభాషణల యానందానందమును గల్గించెడి మిత్రురాలుగను, ఆపద లనుభవించుతఱి నర్ధాంగిగను స్త్రీ వినియోగపడుచుండెను. ఇంతియేగాదు. దేవ గురుపితృపూజ, బంధుసత్కారము, అతిథియభ్యాగతసమారాధనము, గృహనిర్వాహ

కత్వము, శిశుపోషణాది బహువిధకార్య నిర్వాహములకుగూడ స్త్రీయే బాధ్యురాలు. ఇన్ని కార్యభారములు తనశిరముపైఁగల నారీమణి యబలయగుటకు సాధ్యమా? గర్భధారణాది క్లేశములుగూడ నీశ్వరు డబలపైనే యిడెనుగదా.

అయినను సహజముగా కోమలహృదయయు, మృదులవచనయు, శిరీషకుసుమపేశలసదృశసుకుమారశరీరయునగు మనభారతమహిళకు బహుకాలముగా నబలయను నామము వాడుకయందుగలదు. ఈయబలానామముయొక్క ఉత్పత్తికి హేతువులు తొలుదొలుత పురుషునకు స్త్రీయందుండెడి ప్రేమయు, గౌరవమును, కారుణ్యమును కారణముగావచ్చును. కాని రానురా నీయబలాభిధేయము స్త్రీకి బంధహేతువై పోయినది. ఏమన? 'అబల' గదా యేమిచేయు ననుభావము మగవానికిని, 'అబల' ను నేనేమి చేయగలననుతలంపు స్త్రీకిని మనస్సున నాటిపోయినది. ఇందువలన స్త్రీయనిన చులకన మగవానికిని, స్వసామర్థ్యమునం దవిశ్వాస మాడుదానికిని యేర్పడినది. బహ్వనర్థదాయకమగు నీయబలానామము స్త్రీజాతికిఁ గలిగించిన నష్టము కొంచెముగాదు. అయితే యీయబలానామము భారతదేశముననేగాని పశ్చిమఖండములలో లేదు. పాశ్చాత్యదేశములలో స్త్రీయొక్క యబలానామ మిదివఱకే తుడిచివేయఁబడినది. ఆ దేశమునందలి స్త్రీ మతసాంఘికరాజకీయార్థికసారస్వతికశాద్యనేకవిషయములందు పురుషునితో సరితూగి, యొకచో మిన్నయై తనశక్తి సామర్థ్యములు పురుషునిశక్తి సామర్థ్యములకుఁ దక్కువగాదని నిరూపించియున్నది. కావుననే యీదేశమునందలి పురుషవరేణ్యులు స్త్రీయొక్కశక్తినిగూర్చి యిట్లు వాక్రుచ్చియున్నారు. “ * స్త్రీలు బుద్ధిమంతులైనచో వారొక గొప్ప శక్తికాగలరు.... స్త్రీయొక్క ఆశీర్వాదయోగముచే ప్రపంచమున నూతనశక్తి యావిర్భవించునని నా విశ్వాసము.” హెన్రీఫోర్డు కోటీశ్వరునియొక్క యీ యభిప్రాయ మఖిల పశ్చిమఖండాభిప్రాయమని చెప్పనొప్పును.

నేటి భారతదేశావసరములుగూడ స్త్రీ యబలానామముయొక్క యనర్థకమును గుర్తింపవలసినదిగా నున్నవి. సర్వతోముఖముగా పునర్నిర్మాణమును గోరుచున్న భారతదేశమున స్త్రీయొక్క సహాయ మత్యవసరము. స్త్రీయొక్క సహాయములేక యేమతము గాని వ్యాప్తినందదు. ఏసాంఘికవ్యవస్థయుఁ జక్కఁబడదు. ఏసంస్కారముగాని ప్రచార

* కృష్ణాపత్రికలోని దాంపత్యధర్మము అను హెన్రీఫోర్డు అమెరికా కోటీశ్వరుని వ్యాసమునుండి గ్రహింపఁబడినది.

మనకు రాదు. ఏశిథిలరాజ్యముగాని పునరుద్ధరింపఁబడదు. ఏపరాధీన దేశముగాని స్వాతంత్ర్యమును బడయదు. కాన భారతమహిళ తనశక్తిని గుర్తింపక యింకను 'నబల' నను భావముతో నుండుట దేశపురోవృద్ధికి భంగకరము. ఎప్పుడు స్త్రీ పురుషునితోఁబాటు తన మనోదృఢిమను, ధీశక్తిని, వాగ్నైపుణిని, దేహబలమును దేశపురోభివృద్ధికి వినియోగించునో యప్పుడే యేదేశమైనను సత్వరాభివృద్ధిఁగాంచును. అయితే స్త్రీయందంతర్గర్భితమై నిద్రాణమై యున్న యీమహచ్ఛక్తిని జాగరిల్లఁజేయు కర్తవ్యము మాత్రము పురుషులది. మహాప్రభావముగల నీశక్తియే యుద్దీపించెనేని దానిఫలము సామాన్యము గాదు. అవకాశ మొసగినచో స్త్రీశక్తి రాజ్యముల నిర్మించును. రాజతంత్రముల నడుపును. యుద్ధములఁజేయును. శాస్త్రములరచియించును. కవితలల్లును. కళలఁబోషించును. ప్రసంగముల నల్పును. శూరులఁ బుట్టించును. జ్ఞానుల నుత్పాదింపఁజేయును. దేశభక్తుల ప్రసాదించును. పండితప్రకాండుల నొసంగును. కళాకోవిదుల సృష్టించును. అహా! స్త్రీమేధ కతీతమైన విషయ మెద్దిగలదు? సమస్తపదార్థయుత్పత్తికిని భూదేవతవోలె, సర్వమానవసృష్టికిని మాతృదేవతయగు స్త్రీదాస్థానము. యోగ్యయగు జననిగలవుటయే బిడ్డకు మొదటిపాఠశాల. ఆమెపాడు పాటలే బిడ్డకు రెండవబోధనాలయము. శైశవమున నామె చెప్పెడినీతులు, నేర్పెడి వినీతవర్తనమే బిడ్డకు మూడవశిక్షణాలయము. మాతృత్వముయొక్క బాధ్యతను గుర్తెఱింగి తల్లి సుశిక్షనొసంగెనేని యాబిడ్డల భవిష్య మెంత యుచ్చముగనుండునో చెప్పవలెనా?

కాకతీయాంధ్రరాజ్యరమను బాలింపజాలినధీపటిమ, పల్నాటివీరపౌరుషము నుద్దీపింపఁజేయఁ జాలిన కార్యకౌశలము, జ్యోతిశ్శాస్త్రపారమునుగనుగొనజాలిన పాండిత్యగరిమ, గణితశాస్త్రమును విరచింపఁజాలిన మహామేధ, మహామునీషులకు నైతమక్కజమనిపింపఁజాలిన జ్ఞానసంపత్తి, అసువులే తృణముగా వర్జింపఁజాలిన మహాత్కార్యము, సమస్తభూతనిచయమునందును బరమాత్మను దర్శింపఁజాలిన పరమభక్తి, ఖండఖండాంతర వాసులెల్ల రాహ్వానింపఁ జాలిన వాగ్వైభవము, గల స్త్రీ యబలయా? కాదు. కావుననే యొక ఆధునికకవిశేఖరుఁడు స్త్రీసామర్థ్యము నిట్లుగానము సేయుచున్నాఁడు.

" చదువన్నేర్తురు పూరుషుల్ బలెనె శాస్త్రంబుల్ పఠింపించుచో
నదమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారముల్ నేర్పుచో
నుదితోత్సాహముతోడ నేలఁ గలరీయుర్విన్ బ్రతిష్ఠించుచో
ముదితల్ నేరగరానివిద్యగలదే? ముద్దార నేర్పించినన్. "